teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 193 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 9 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## కేసీఆర్‌కు మేడారం జాతర ఆహ్వానం

మాజీ సీఎం నివాసానికి మంత్రులు

ఆడబిడ్డలుగా భావించి కేసీఆర్ దంపతుల సత్కారం



02

# కుక్కలకు బదులు పిల్లులను పెంచుకోండి

## వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

- మనిషి భయాన్ని కుక్కలు పసిగడతాయని, భయపడితే దాడి చేస్తాయని వ్యాఖ్య
- ఎలుకల నియంత్రణకు కుక్కలు అవసరమన్న స్వచ్ఛంద సంస్థల వాదన

వివరాలు 2లో

దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల దాడులు వాటి నియంత్రణ పై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్కల బెడద తీవ్రమవుతున్న నేపథ్యంలో "కుక్కలను పెంచుకునే బదులు పిల్లులను పెంచుకోండి, కనీసం అవి ఎవరిపై దాడి చేయవు కదా" అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది.





## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఫిబ్రవరి 3 నుంచి ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు

వచ్చే ఎనిమిదేళ్లు మనమే అధికారంలో ఉంటాం

.. వివరాలు 3లో



## అనుమతి లేని "పత్తి" విత్తనాలపై ఉక్కుపాదం

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

అనధికార విత్తనాల విక్రయాలపై మంత్రి సీరియస్

.. వివరాలు 2లో



## చైనా మాంజాపై హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం

- రూ. 1.2 కోట్ల నిల్వలు స్వాధీనం
- చైనా మాంజా విక్రయాలపై సిపి సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): చైనా మాంజాపై కేంద్రం నిషేధం విధించిందని హైదరాబాద్ సిపి సజ్జనార్ తెలిపారు. కొన్ని ఈ కామర్స్ సైట్లకు నోటీసులు ఇచ్చామని అన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో

## తెలంగాణ డీజీపీ నియామకంలో ఉత్కంఠ

- హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి
- రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో కీలకంకానున్న నేటి తీర్పు



05



## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా

- ఫిబ్రవరిలో పోలింగ్!
- రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ కీలక భేటీ

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

02

## సొంతూళ్లకు ప్రయాణికుల క్యూ.. కిక్కిరిసిన రైల్వే స్టేషన్లు

సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలో రద్దీ

పార్కింగ్ మార్పులు, భద్రతా ఏర్పాట్లు



సికింద్రాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు సంక్రాంతి పండుగకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయింది. విద్యార్థులు, ఉద్యోగులు

మిగతా 2 లో



## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

నిరుద్యోగుల డిమాండ్

నిరసనకారులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

రేవంత్ సర్కార్‌పై కల్వకుంట్ల కవిత నిప్పులు

## తెలంగాణ సమగ్రాభివృద్ధికి బ్లూప్రింట్

కవిత ఆధ్వర్యంలో మరో 12 కమిటీల ఏర్పాటు

మొత్తం 44కు చేరిన కమిటీల సంఖ్య

02



## టెలిమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై హరీష్ రావు ధ్వజం

హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): టెలీమెట్రీల ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. కృష్ణా జలాల వినియోగ లెక్కలు తేల్చేందుకు టెలిమెట్రీల కోసం కేటాయించిన రూ.4.18 కోట్ల నిధులను కేఆర్ఎంబీ దారి మళ్లిస్తుంటే తెలంగాణ

మిగతా 2 లో



## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

కాంగ్రెస్ పాలన అంటే కూల్చివేతలు, పేల్చివేతలు

కేటీఆర్ ఘాటు విమర్శలు!

హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): స్వార్థం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు పార్టీ మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని

మిగతా 3 లో



# కుక్కలకు బదులు పిల్లులను పెంచుకోండి

న్యూ ఢిల్లీ, జనవరి 08 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల దాడులు వాటి నియంత్రణ పై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్కల బెడద తీవ్రమవుతున్న నేపథ్యంలో "కుక్కలను పెంచుకునే బదులు పిల్లులను పెంచుకోండి, కనీసం అవి ఎవరిపై దాడి చేయవు కదా" అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీధి కుక్కలకు ఆహారం పెట్టే వాళ్ళు వాటి వల్ల ప్రమాదాలు ఎదుర్కొంటున్న సాధారణ ప్రజల మధ్య జరుగుతున్న వాదనలను వింటున్న క్రమంలో న్యాయమూర్తులు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కుక్క కాటు బాధితుల సంఖ్య పెరుగుతుండటం, రేబిస్ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉండటం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల పట్ల ప్రేమ ఉండాల్సిందేనని, అయితే అది మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలకు నష్టపరిహారం, వీధి కుక్కల బెడద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తదుపరి విచారణలో స్పష్టమైన ఆదేశాలు వెలువడే అవకాశం ఉంది.



# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా

తెలంగాణ బ్యూరో, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా 2019 నాటి ఓటరు జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కూడా 'నోటా' ను సమర్థవంతంగా అమలు చేయడంపై పార్టీల అభిప్రాయాలను కోరారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణపై అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో పలు రాజకీయ పార్టీలతో సమావేశాలు ముగిశాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ స్థాయిలో అధికారులు కసరత్తును ముమ్మరం చేశారు. జనవరి 10 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కాగా, మరోవైపు రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లకు ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి జనవరి 20 వరకు అధికారిక నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మార్చిలోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.

# టెలిమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం చోద్యం చూడటం సిగ్గుచేటని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే టెలిమెట్రిల ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేస్తూ, కృష్ణా జలాల ఏపీ అక్రమ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఇవాళ ఓ ప్రకటన విడుదల చేసిన హరీశ్ రావు జూన్ 2016లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశ నిర్ణయం ప్రకారం మొదటి దశలో 18 చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు చేయగా, రెండో దశలో ఇంకా 9 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అమలు కాకపోవడం దురదృష్టకరం అన్నారు.

## తెలంగాణకు తీరని అన్యాయం:

కేఆర్ఎంబీ నిర్ణయం ధిక్కరిస్తూ టెలీమెట్రి ఏర్పాటు కోసం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు కేంద్రం నిలదీయలేదు? ఎందుకు ఏపీ మీద ఒత్తిడి చేయకుండా మౌనంగా ఉన్నట్లు? అని నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడాల్సిన కేఆర్ఎంబీ, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ, కేంద్రంలోని బీజేపీ మూడు కలిసి టెలీమెట్రిల ఏర్పాటును నిర్లక్ష్యం చేస్తూ తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. టెలీమెట్రి ఏర్పాటు చేస్తున్నాం అని ప్రచారం చేసుకోవడమే తప్ప రెండేళ్ల నుండి కేంద్రం చేసింది ఏం లేదన్నారు.

## కావాలనే నిర్లక్ష్యం శోచనీయం:

సబ్ జ్యూడిస్ అని సాకులు చెప్పే కేంద్రానికి, సుప్రీం కోర్టులో కేసు ఉన్నప్పటికీ కేసీఆర్ 18 చోట్ల టెలీమెట్రిలు ఏర్పాటు చేసిన విషయం గుర్తు లేదా? పోలవరం నల్లమల సాగర్ విషయంలో మొద్దు నిద్ర ప్రదర్శించినట్లు గానే టెలిమెట్రిల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం అన్నారు. రూ.4.18 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే రికవరి అయ్యేలా చేసి, టెలిమెట్రిల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. కేవలం లేఖలు రాస్తూ కాలయాపన చేయకుండా నిధులు మళ్లించిన కేఆర్ఎంబీ పై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# అనుమతి లేని "పత్తి" విత్తనాలపై ఉక్కుపాదం



హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టీ పత్తి విత్తనాలు అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. అనధికారికంగా అమ్మకాలు చేసే పత్తి విత్తనాల ప్యాకెట్లను అరికట్టాలని సూచించారు. గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ సంచాలకులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హెచ్‌టీ, బీసీ–III పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్శాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్‌లో ఫెయిల్ అవడంతో పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు హెచ్‌టీ పత్తి విత్తనాలను గుట్టు చప్పుడుగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా చేసిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు హెచ్ టీ విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. హెచ్‌టీ పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని మాయమాటలు నమ్మి పత్తి విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడితే అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్‌లు కూడా కలుషితం అవుతాయని వివరించారు.

# కేసీఆర్‌కు మేడారం జాతర ఆహ్వానం



హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో అరుదైన, ఆహ్లాదకరమైన పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ వైరుధ్యాలను పక్కన పెట్టి, సంప్రదాయానికి పట్టం కడుతూ రాష్ట్ర మంత్రులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి సీతక్క గురువారం సాయంత్రం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. వారికి మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ సాదర స్వాగతం పలికారు. త్వరలో జరగబోయే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం 'సమ్మక్క–సారలమ్మ మహా జాతర'కు ప్రభుత్వం తరఫున హాజరు కావాలని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ దంపతులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రులు గులాబా బాస్‌కు శాలువా కప్పి, జాతర ఆహ్వాన పత్రికతో పాటు మేడారం ప్రసాదాన్ని అందజేశారు

## తెలంగాణ సంప్రదాయంతో సత్కారం



తమ నివాసానికి వచ్చిన మహిళా మంత్రులకు కేసీఆర్, శోభమ్మ దంపతులు ఘనస్వాగతం పలికారు. కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, ఇంటికి వచ్చిన ఆడబిడ్డలుగా భావించి వారికి పసుపు, కుంకుమ, వస్త్రాలు, తాంబూలాలను అందజేసి సంప్రదాయబద్ధంగా సత్కరించారు. అనంతరం వారితో కలిసి తేనీటి విందు స్వీకరించి, కాసేపు ఇష్టాగోష్టిగా యోగక్షమాలు చర్చించారు. అనంతరం మంత్రులు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

# చైనా మాంజాపై "హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం"



మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా నిల్వ చేసి చైనా మాంజాను విక్రయిస్తున్నారని, చైనా మాంజాకు గాజు పెంకులు, మెటలిక్ కోటింగ్ చేస్తారని తెలియజేశారు. గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో భారీగా మాంజా స్వాధీనం చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్ లో భారీగా చైనా మాంజా పట్టుకున్నామని, రూ.1.2 కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నామన్నారు. చైనా మాంజా అమ్ముతున్న 143 మందిపై నమోదు చేయడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. ఢిల్లీ, సూరత్, మహారాష్ట్ర నుంచి చైనా మాంజాను తీసుకొచ్చి హైదరాబాద్ లో అమ్ముతున్నారని తెలిపారు.

# తెలంగాణ డీజీపీ నియామకంలో ఉత్కంఠ

హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ డీజీపీ నియామకంపై హైకోర్టులో పిటిషన్ దాఖలవ్వగా తాజాగా దానిపై వాదనలు ముగిశాయి. డీజీపీ జితేందర్ స్థానంలో గతేడాది ప్రభుత్వం శివధర్ రెడ్డిని నియమించింది. ఈ నియామకం సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా జరగలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రెండు వారాల్లోగా ఐపీఎస్ అధికారులతో కూడిన ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గతేడాది డిసెంబర్ 24న ఆదేశించింది. తాజాగా దీనిపై వాదనలు పూర్తవ్వగా తీర్పును నేటికి రిజర్వ్ చేసింది. మరోవైపు తెలంగాణ పూర్తిస్థాయి డీజీపీ నియామకానికి రాష్ట్రప్రభుత్వం యూపీఎస్సీ కి ప్రపోజల్స్ పంపింది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి, సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, ఆప్టే, సౌమ్య మిశ్రా, శికా గోయల్ పేర్లను జాబితాలో ఉంచింది. అయితే సుప్రీంకోర్టు అనుమతి కావాలంటూ ఆ జాబితాను యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపింది. లిస్టును ఆలస్యంగా పంపడంతో సుప్రీంకోర్టు అనుమతి కావాలని సమాధానమిచ్చింది. 9 నెలల క్రితం ఒకసారి, గత నెల 31న రెండోసారి డీజీపీల ప్యానెల్ జాబితా యూపీఎస్సీకి పంపితే క్లారిఫికేషన్ పేరుతో ఆలస్యం చేసిందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో రేపు తెలంగాణ హైకోర్టు ప్రస్తుత డీజీపీ నియామకంపై ఇవ్వనున్న తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# తెలంగాణ సమగ్రాభివృద్ధికి బ్లూప్రింట్



హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించే బ్లూ ప్రింట్‌లో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరో 12 కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 32 కమిటీలను ప్రకటించిన గురువారం అదనంగా 12 కమిటీలు ఏర్పాటు చేశారు. మొత్తం 44 కమిటీలు ద్వారా ఆయా రంగాల్లో స్టడీ చేయనున్నారు. ఎక్స్ సర్వీస్‌మెన్, గిగ్ వర్కర్స్, జర్నలిస్టులు, వికలాంగుల సంక్షమం-సాధికారత, బిజినెస్/ఎంఎస్ఎంఈ, స్పోర్ట్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్–రోడ్స్–ఇన్‌ఫ్రాస్ట్రక్షర్, ఎన్విరాన్‌మెంటల్–ఫారెస్ట్, అర్బన్ ప్లానింగ్, హౌసింగ్, దేవాదాయ–అన్ని మతాల ప్రార్థన మందిరాలు, అభివృద్ధి, ఎనర్జీ–గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ఈ కమిటీలు పనిచేయనున్నాయి. ఒక్కో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. వీరు ఆయా రంగాల్లో స్టడీ చేసి తమ నివేదికలను ఈ నెల 17వ తేదీ వరకు స్టీరింగ్ కమిటీకి అందజేయనున్నారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని అశోక్ నగర్ లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మెరుపు ఆందోళనకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిరుద్యోగులను చదరగొట్టి పలువురు ముఖ్యులను అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టిన నిరుద్యోగులపై రేవంత్ సర్కార్ ఉక్కుపాదం మోపడంపై తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆమె. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మి వంచిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని చెప్పి, రెండేళ్లలో 20 వేల ఉద్యోగాలకు మించి ఇవ్వలేదని ఆమె విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, తక్షణమే వారందరినీ విడుదల చేసి, స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.

# సొంతూళ్లకు ప్రయాణికుల క్యూ.. కిక్కిరిసిన రైల్వే స్టేషన్లు

మొదటి పేజీ తరువాయి

తమ కుటుంబాలతో కలిసి భారీగా సొంతూళ్లకు తరలివెళ్తున్నారు. గురువారం ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు భారీ ఎత్తున ప్రయాణికులు తరలివస్తున్నారు. అయితే, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను ప్రకటించింది. ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ప్రాంతాలకు డిమాండ్ విపరీతంగా ఉండటంతో అదనపు సర్వీసులు నడుపుతున్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని తగ్గించడానికి హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనవరి 7 నుంచి 20 వరకు తాత్కాలిక హాల్ట్‌లు కల్పించారు. ఐటీ ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే వీలు కల్పించారు.

## పార్కింగ్, ఎగ్జిట్ రూట్ల మార్పు

మరోవైపు సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున, ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు పార్కింగ్, ఎగ్జిట్ రూట్‌ను మార్చేశారు. అదేవిధంగా ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రైల్వే శాఖ అదనపు సిబ్బందిని, పోలీసు బలగాలను మోహరించారు. ఇక అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునే ప్రయాణికులు 'రైల్ వన్' యాప్ యూజ్ చేసి 3 శాతం డిస్కౌంట్ పొందవచ్చని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

# కొలుకుంటున్న కాంగ్రెస్ అగ్రనేత

### సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్

### ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం



న్యూ ఢిల్లీ, జనవరి 08 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థత కారణంగా ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో గత సోమవారం రాత్రి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు ఆమె శరీరం బాగా సహకరిస్తోందని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ అధికారికంగా ప్రకటించారు. సోనియా గాంధీని ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షిస్తోందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన చలి, వాయు కాలుష్యం కారణంగా సోనియా గాంధీకి 'బ్రాంకియల్ ఆస్తమా' సమస్య కొద్దిగా తిరగబెట్టినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ముందుజాగ్రత్త చర్యగా ఆమెను అడ్మిట్ చేసుకున్న వైద్యులు, ప్రస్తుతం యాంటీబయాటిక్స్, ఇతర అవసరమైన మందులతో చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతుందని, వైద్యుల సూచనల మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

# సీఎం రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ మంత్రి భేటీ

### తెలంగాణ విద్యా సంస్కరణలపై ప్రశంసలు

### జాతీయ విద్యా విధానం తరహాలోనే రాష్ట్రానికి ప్రత్యేక విధానం



హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్ బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను సీఎం హిమాచల్ ప్రదేశ్ మంత్రికి వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ. 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. మల్లెపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ మంత్రి బృందానికి సూచించారు. మంత్రి రోహిత్ కుమార్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై ఆసక్తి చూపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి విజన్ ను అభినందించారు.

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ భవన్‌లో గురువారం కేటీఆర్ సమక్షంలో కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ రంజిత్‌తో పాటు వార్డు మెంబర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై, మంత్రి జూపల్లి కృష్ణారావుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**రేవంత్ రెడ్డిని సంతృప్తి పరచడానికి**

మంత్రి జూపల్లి కృష్ణారావు గతేడాది ఆదిలాబాద్‌లో 'కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వస్తుందో లేదో తెలియదు, నేనూ గెలుస్తానో లేదో తెలియదు' అని స్వయంగా చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి నాయకుడిని ఎట్టి పరిస్థితుల్లో గెలిపించబోమని కొల్లాపూర్ ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కేసీఆర్‌ను పొగిడిన జూపల్లి, ఇప్పుడు రేవంత్ రెడ్డిని సంతృప్తి పరచడానికి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తన మంత్రి పదవిని కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డిని ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగడ్తలు కురిపిస్తున్నారని ఆరోపించారు. అవకాశవాదంతో కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకుడిగా జూపల్లి కృష్ణారావును ఆయన అభివర్ణించారు.

**ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలు**

జూపల్లి అరాచకాలను ఎదుర్కొని పంచాయతీ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ గట్టిగా గెలిచిందని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలనను మూడు మాటల్లో చెప్పాలంటే ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలే తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. ఒకవైపు ఆరు గ్యారెంటీలను ఎగవేస్తూ, హైడ్రా వంటి అరాచక విధానాలతో ఇళ్లను కూల్చివేస్తూ, చెక్‌డ్యామ్‌లను పేల్చివేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. చెక్‌డ్యామ్‌లు కట్టాల్సిన చోట పేల్చివేతలకు పాల్పడుతున్న ఏకైక దరిద్రపుగొట్టు ప్రభుత్వం ప్రపంచంలో కాంగ్రెస్ ఒక్కటే అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాల నుంచి తెలంగాణను కాపాడాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గట్టిగా పోరాడి గెలవాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### ఫిబ్రవరి 3 నుంచి ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు

### వచ్చే ఎనిమిదేళ్లు మనమే అధికారంలో ఉంటాం



హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ సత్తా ఏమిటో చూపారని ఇక రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ పూర్తి స్థాయి మెజార్టీ సాధించి అన్ని మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి చూపించాం. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టి గుండు సున్నకు తీసుకువెళ్లాం. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాం. గ్రామపంచాయతీల్లో మనం పూర్తి స్థాయిలో పట్టు సాధించామన్నారు. రాష్ట్రంలో రాబోయే మరో 8 ఏళ్లు మనమే అధికారంలో ఉండబోతున్నామని అందువల్ల స్థానిక సంస్థలలో మన పట్టు ఉంటేనే గల్లీలను అభివృద్ధి చేయగలమన్నారు. గురువారం గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన పీసీసీ, పీఏసీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం పాల్గొన్నారు. పురపాలక ఎన్నికలు, పీబీ జీరామ్ జీ పథకం, తాజా రాజకీయాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం బీఆర్ఎస్, బీజేపీ సభలలో చర్చకు రావడం లేదు. ప్రజా సమస్యల కోసం ఈ రెండేళ్లలో బీఆర్ఎస్ నుంచి ఒక్క ఎమ్మెల్యే కూడా నా వద్దకు వచ్చి నిధులు అడగలేదు. వాళ్లకు రాజకీయ పదవులు కావాలే తప్ప ప్రజా సమస్యలపై పట్టింపు లేదని విమర్శించారు.

**అప్పటి వరకు మోడీని వదిలేది లేదు:**

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉపాధి హామీతో ఎన్నో విప్లవాత్మక మార్పులొచ్చాయని కానీ అధికారం ఉందని మోడీ సర్కార్ ఇష్టారీతిన వ్యవహరిస్తోందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్చుదామని బీజేపీ ప్రణాళికలు చేసింది. కానీ ఆశించినన్ని స్థానాలు రాకపోవడంతో రాజ్యాంగాన్ని మార్చలేకపోయారు. దీంతో వేరే రూపంలో ప్రజల హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ దేశంలో ఇళ్లు, ఆస్తి లేని వారికి ఓటు హక్కు ఒక్కటే ఆయుధం అని ఈ హక్కును తొలగాలనే ఎస్ఐఆర్ తీసుకువచ్చారన్నారు. ఓటు హక్కు తీసేస్తే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ప్రభుత్వ సంక్షమ పథకాలు ఆగిపోతాయన్నారు. చివరకు ఈ దేశంలో ఉండాలా లేదా అనే నిర్ణయం బీజేపీ చేతిలోకి వెళ్తుందన్నారు. ఈ దేశంలో వెట్టిచాకిరిని తిరిగి తీసుకువచ్చేందుకు బీజేపీ ఎస్ఐఆర్ ద్వారా ప్రయత్నిస్తోందన్నారు. అదానీ, అంబానీలకు తక్కువ ధరకు కూలీలు దొరకడం లేదని ఉపాధి పథకాన్ని మారుస్తున్నారు. ఇది కార్పొరేట్ కంపెనీల కుట్ర అని దీన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. వ్యవసాయాన్ని నీరుగార్చడం కోసం గతంలో నల్లచట్టాలు తీసుకు వస్తే నల్లచట్టాలు ఉపసంహరించుకునేలా చేయడమే కాకుండా జాతికి మోడీ క్షమాపణలు చెప్పేలా కాంగ్రెస్ చేసిందన్నారు. ఇప్పుడు మళ్లీ ఉపాధి హామీ పథకం విషయంలో జాతికి క్షమాపణ చెప్పే వరకు మోడీని వదిలేదే లేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి సారి అమలైన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి తీసుకు వచ్చే వరకు మోడీని వదిలేది లేదన్నారు.

**జనవరి 20 నుంచి గ్రామ సభల్లో తీర్మానాలు చేయాలి:**

పీబీ జీరామ్ జీ చట్టం విషయంలో ఏఐసీసీ నుంచి సంపూర్ణ కార్యాచరణతో ముందుకు వెళ్తామని సీఎం చెప్పారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని ఇక రాష్ట్రంలోని 12,702 గ్రామాల్లో జనవరి 20 నుంచి 30వ తేదీ లోపు గ్రామసభలు నిర్వహించి ఈ చట్టాన్ని తిరస్కరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ తీర్మానం చేయడం గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌ల బాధ్యత మాత్రమే కాదని ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అన్నారు. అందువల్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లు మినహా మిగతా 15 పార్లమెట్ సెగ్మెంట్లకు మంత్రులను ఇన్ చార్జులుగా పార్టీ పరంగా నియమించాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్ష నటరాజన్‌ను కోరారు. అలాగే జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఒక్కొక్కరు ఒక మండలం బాధ్యతలు తీసుకోవాలని ముఖ్యమంత్రిగా తాను కూడా ఒక మండలం బాధ్యతను తీసుకుంటానన్నారు.

**జిల్లాల్లో బహిరంగ సభలు:**

హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని మిగతా 9 ఉమ్మడి జిల్లాల్లో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో పీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఈ సభను ప్రారంభించాలన్నారు. ఈ సభల్లో తాను పాల్గొంటానన్నారు. నరేంద్ర మోడీ దుర్మార్గమైన ఆలోచన, పేద ప్రజలు, రైతు కూలీలను కట్టుబానిసలుగా చేసే ప్రయత్నాన్ని తిరస్కరిస్తూ ఈ సభలు నిర్వహించాలన్నారు. ఈ తొమ్మిది సభలకు ఒక్కో జిల్లాల్లో ఒక్కో మంత్రికి బాధ్యతలు ఇవ్వాలన్నారు. ఈ సభల సమన్వ బాధ్యతలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, ఈ కార్యక్రమాలన్నింటి పర్యవేక్షణ బాధ్యతలు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్ష నటరాజన్ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఈ రాష్ట్రంలో చూస్తున్న శాఖకు మంత్రి సీతక్క. సీతక్క నియోజకవర్గంలో పెద్ద బహిరంగ సభను నిర్వహించి ఈ కార్యక్రమానికి ఆరోగ్యం సహకరిస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేను ఆహ్వానిస్తామన్నారు.

# హైదరాబాద్ వేదికగా బయోఏషియా 2026

### ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు సదస్సు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




హైదరాబాద్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): ఆసియాలో అత్యంత ప్రతిష్టాత్మక లైఫ్ సైన్సెస్, హెల్త్-టెక్ సదస్సుగా పేరుగాంచిన బయోఏషియా-2026 (23వ ఎడిషన్) హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారిక పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమల అండ్ వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఆవిష్కరించారు. కాగా ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయోఏషియా సదస్సు ఏర్పాట్లు అధికారికంగా ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. బయో ఏషియా వంటి అంతర్జాతీయ సదస్సులు తెలంగాణ నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించడంతోపాటు, కొత్త భాగస్వామ్యాలు, పెట్టుబడులు, పరిశ్రమల అభివృద్ధికి కొత్త మార్గాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. బయో ఏషియా 2026తో టెక్‌బయో విప్లవాన్ని ముందుకు నడిపిస్తూ ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రపంచ నిపుణులను హైదరాబాద్‌లో ఒకే వేదికపైకి తీసుకురావడం తమ లక్ష్యమని అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ బయో ఏషియా 2026 స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమల నాయకులు, పాలసీ మేకర్‌ల మధ్య సహకారాన్ని పెంచే శక్తివంతమైన వేదికగా నిలుస్తుందని చెప్పారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, సాంకేతిక మార్పిడి కోసం ఈ సదస్సు కీలక అవకాశాలను అందిస్తుందని తెలిపారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టెక్‌బయో ఆరోగ్యరంగాన్ని పూర్తిగా కొత్త దిశలోకి తీసుకెళ్తున్నదని చెప్పారు. బయాలజీ, ఏఐ, ఆటోమేషన్, డేటా కలయికతో కొత్త ఆవిష్కరణలు, పెట్టుబడులు, ప్రభావం కోసం పెద్ద అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. బయో ఏషియా 2026 కేవలం చర్చల వేదికగా కాకుండా, ఆలోచనలను కార్యరూపం లోకి తీసుకువచ్చే వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



**ఆసియాలోనే అగ్రగామి వేదిక**

రెండు దశాబ్దాలుగా బయోఏషియా ఆసియాలోనే ప్రముఖ లైఫ్ సైన్సెస్, బయోఫార్మా, హెల్త్-టెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆసియాలో అగ్రగామి వేదికగా నిలుస్తున్నది. ప్రతి ఎడిషన్‌లో ప్రపంచస్థాయి నాయకులు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నది. అత్యాధునిక శాస్త్రీయ ప్రగతిని పంచుకుంటున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ బయోఫార్మా, వ్యాక్సిన్‌లు, మెడ్‌టెక్, డిజిటల్ హెల్త్ ఆవిష్కరణల గ్లోబల్ హబ్‌గా మరింత బలపరుస్తున్నది. రాష్ట్రంలోని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యంతో కూడిన శాస్త్రవేత్తల ప్రతిభ ఎదుగుదలకు పునాదిగా నిలుస్తున్నాయి.

# యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశం

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




ములుగు జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): యువత తమ క్రీడా ప్రతిభను కనబరచడానికి సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశమని ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్ లో సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయడం కోసం సీఎం కప్ రెండవ ఎడిషన్ సరైన వేదిక అని ఈ అవకాశాన్ని గ్రామీణ స్థాయి యువత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించిన అవగాహన కల్పించడానికి జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల వరకు, 8వ తేదీన ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, జడ్పీహెచ్ఎస్ మల్లంపల్లి పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్ పాఠశాలలో, మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు, జడ్పీహెచ్ఎస్ గోవిందరావుపేట్ పాఠశాలలో సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు, 9వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు,

జడ్పీహెచ్ఎస్ మంగపేట పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏ హెచ్ ఎస్ గర్ల్స్ తాడ్వాయి పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు, 10వ తేదీన జడ్పీహెచ్ఎస్ ముప్పనపల్లి పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, జడ్.పి.హెచ్.ఎస్ వాజేడు పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,

జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు టార్చ్ ర్యాలీ కొనసాగనుంది పేర్కొన్నారు. శాట్స్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ స్థాయిల్లో మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని,ఈ నెల 17 వ తేదీ నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వ తేదీ వరకు వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా క్రీడాకారులు ఎక్కువ మెడల్స్ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అధికారి మలోత్ సర్దార్ సింగ్ , డి ఈ ఓ సిద్దార్థ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడలా వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు, పీడీలు, పిఈటి లు , కోచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సబ్ ప్లాన్ అమలు కోసం కలెక్టర్‌కి వినతిపత్రం



భూపాలపల్లి, జనవరి 08 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రవి పటేల్ భూపాలపల్లి జిల్లా బీసీ సబ్ ప్లాన్ అమలు కోసం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మాట్లాడుతూ

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే బీసీల సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాల సామాజికఉఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే, బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు మరియు చట్టపరమైన రక్షణ అత్యవసరం అని పార్టీ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి (2014ఉ2024) బీసీల కోసం బడ్జెట్ కేటాయింపులు చేసినప్పటికీ, మొత్తం సుమారు 30 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌లో కనీసం 25 శాతం కూడా బీసీల కోసం ఖర్చు చేయకపోవడం బాధాకరం అని విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం

ప్రతి బడ్జెట్‌లో బీసీలకు రూ. 20,007 కోట్ల నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య డిమాండ్లు :**

1. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా కనీసం 50% పైగా బడ్జెట్ నిధులు కేటాయించాలి
2. కేటాయించిన నిధులు పూర్తిగా బీసీల కోసమే ఖర్చు అయ్యేలా బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి
3. విద్యారంగంలో బీసీ విద్యార్థుల కోసం ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి
4. విదేశీ విద్యా పథకాన్ని మరింత సరళతరం చేసి విస్తరించాలి
5. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమగ్ర కుల గణన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలి

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభిప్రాయం ప్రకారం, చట్టబద్ధమైన సబ్ ప్లాన్ అమలుతోనే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. కావున ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు జినుకల శ్రీను బొట్టు సంపత్ కంకల అశోక్ శ్రీకాంత్ రొడ్డ శ్రీను జస్వంత్ రాంబాబు ప్రభాత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాల పేరుతో యూనివర్సిటీ భూముల కబ్జా సరికాదు




## ఎమ్మెల్యే నాయిని వాఖ్యలపై కేయు బిఆర్ఎస్వి నేతల మండిపాటు

హనుమకొండ కేయు, జనవరి 08 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సమావేశాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి యూనివర్సిటీ భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు విషయంలో అనాలోచితంగా నిర్ణయం తీసుకుని ఇప్పుడు మా విద్యార్థి విభాగంపై తప్పుడుగా మాట్లాడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్వి గెస్ట్ హౌ స్ లో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ రాష్ట్ర నాయకులు కత్తెరపల్లి దామోదర్, డా. కొమురయ్య, బిఆర్ఎస్వి ఇంచార్జి జెట్టి రాజేందర్, లు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో వరం గల్ పశ్చిమ ఎమ్మెల్యే న్యాయం రాజేందర్ రెడ్డి కాకతీయ యూనివర్సిటీ భూమిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తుందని వారు పేర్కొన్నారు. యూనివర్సిటీ భూమిలో పాఠశాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నది ఒక్క బీఆర్ఎస్కు అనుబంధమైన బీ ఆర్ ఎస్ వీ అని, మిగతా అన్ని విద్యార్థి సంఘాలు దీనికి మద్దతు ఇస్తున్నాయని విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతున్న విద్యార్థి సంఘం ప్రస్థానాన్ని అసెంబ్లీ వేదికగా వక్రీకరించడం సిగ్గుచేటు అని అన్నారు. బీ ఆర్ ఎస్ వీ విద్యా సంస్థలకు వ్యతిరేకం కాదని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాన్ని స్వాగతిస్తామని తెలిపారు. కానీ దానికి యూనివర్సిటీ భూమిని త్యాగం చేయడం అంగీకరించబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తు తరాల విద్యార్థుల అవసరాల కోసం యూనివర్సిటీ భూములను కాపాడటం తమ బాధ్యత అని అన్నారు. హనుమకొండ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేవని చెప్పడం వాస్తవ విరుద్ధమని బీ ఆర్ ఎస్ వీ నాయకులు స్పష్టం చేశారు. హనుమకొండ చుట్టుపక్కల అనేక ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ, వాటిని పక్కనపెట్టి యూనివర్సిటీ భూమినే లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఖబ్జా కుట్ర దురుద్దేశం కనిపిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీ ముందున్న టీబి ఆస్పత్రి స్థలం సహా ప్రత్యామ్నాయ భూములు ఉన్నాయని గుర్తు చేశారు. గతంలో కాకతీయ యూనివర్సిటీ భూములపై జరిగిన అక్రమాలపై బీ ఆర్ ఎస్ వీ పోరాటం చేయడంతో సర్వే నిర్వహించినా, ఆ సర్వే రిపోర్టును ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ పాఠశాల నిర్మాణం పేరుతో యూనివర్సిటీ భూమిని కబ్జా చేసే ప్రయత్నంగా ఈ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ ఒక స్వతంత్ర, స్వాయత్త విద్యా సంస్థ అని బీ ఆర్ ఎస్ వీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, స్థానిక ఎమ్మెల్యే గానీ యూనివర్సిటీపై పెత్తనం చెలాయించే హక్కు ఎవరికీ లేదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. యూనివర్సిటీ భూమిని పాఠశాలకు కేటాయించేందుకు చట్టబద్ధమైన ఆధారాలు ఏవైనా ఉంటే ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. చివరగా యూనివర్సిటీ భూమిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి. యూనివర్సిటీ భూములపై జరిగిన సర్వే రిపోర్టును తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్రమాల్లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకునే వరకు బీ ఆర్ ఎస్ వీ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్లు రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజు, ముస్కే రాము, గొల్లపల్లి వీరు, పస్తం అనిల్ కోరాపెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు..

# ఆర్టీఐ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులు



సిద్దిపేట జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలోని జిల్లా అధ్యక్షులు చుంచు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ పాల్గొని, మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తూ అడిగిన సమాచారాన్ని కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించకుండా, అవినీతిని నిర్మూలించకుండా పోయిందని అని అన్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా సెక్షన్ 5(2),5(3) ప్రకారం సమాచార హక్కు చట్టం-2005 బోర్డులు నిర్వహించాలి కానీ అధికారులు నిర్వహించడం లేదు అని మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జైన శ్రీనివాస్, భూపతి, లక్ష్మకాంత్ రెడ్డి, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగులపై కాంగ్రెస్ సర్కార్ దమనకాండ

## ఖండించిన ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, జనవరి 08 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ అశోక్ నగర్లో ఉద్యోగాల నోటిఫికేషన్ ల కోసం శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగుల పై లాఠీ ఛార్జ్ జరిపిన కాంగ్రెస్ రేవంత్ సర్కార్ చర్యను హేయమైనదని, తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగులను వాడుకొని గద్దెనెక్కిన రేవంత్రెడ్డి అధికార మదంతో విర్ర విగుతు నిరుద్యోగుల రక్తం కళ్ళ చూస్తున్నాడని విమర్శించారు. కొత్త నోటిఫికేషన్లు రాకపోగా అభయ హస్తం లో ఇచిన హామీలన్నీ నీటి బుడగలై తేలిపోయాయని అన్నారు. ప్రజా పాలన పేరిట ప్రజా వంచనకు పాల్పడుతున్న రేవంత్ సర్కారుకు తగిన గుణపాఠం నేర్పే రోజు దగ్గర పడిందని హెచ్చరించారు. నిర్బంధాలు మాని, నిరుద్యోగ న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థి నిరుద్యోగులపై లాఠీ ఛార్జ్ చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# వర్సిటీ భూములు విద్యార్థుల అవసరాలకు వినియోగించాలి

## కాజీపేట ఏసీపీ కార్యాలయానికి కేటాయించవద్దు : కేయూ జేఏసీ



హనుమకొండ కేయు, జనవరి 08 (తీన్మార్ న్యూస్): కేయూ భూములు విద్యార్థులు అవసరాలకు వినియోగించాలి. విద్యార్థుల అవసరాలు తప్ప ఇతర ప్రభుత్వ, పోలీస్ శాఖలకు కేటాయించవద్దని కేయూ పరిశోధక విద్యార్థి, జేఏసీ అధ్యక్షులు డి.తిరుపతి అన్నారు. కేయూ స్థలం ఇతర శాఖలకు కేటాయించవద్దని కేయూ జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు.కాకతీయ యూనివర్సిభూములు క్రమంగా ప్రభుత్వ కార్యాలయాలకు అడ్డాగా మారుతుందనీ, యూనివర్సిటీ భూములు, పరిశోధనలు, కొత్త కోర్సుల విభాగాల ఏర్పాటు, హాస్టళ్ల నిర్మాణం, మరియు క్రీడా మైదానాల కోసం ఉద్దేశించినవి. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ వారికి వసతులు కల్పించాల్సింది పోయి, ఉన్న భూమిని పోలీసు శాఖకు లేదా ఇతర విభాగాలకు కేటాయించడం వల్ల భవిష్యత్తులో యూనివర్సిటీ విస్తరణకు స్థలం లేకుండా పోతుంది,గతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో సీ ఆర్ పీ ఎఫ్ కి భూమి ఇవ్వడం, వారు వెళ్ళిపోయాక మళ్ళీ దాన్ని యూనివర్సిటీకి అప్పగించకుండా కాజీపేట ఏసీపీ కార్యాలయానికి కేటాయించాలనుకోవడం,ఒక్కసారి ప్రభుత్వ భవనాలు క్యాంపస్‌లోకి వస్తే, ఆ తర్వాత ప్రజా రాకపోకలు పెరిగి, క్యాంపస్ లో ఉండాల్సిన ప్రశాంతత వాతావరణం దెబ్బతింటుంది. భవిష్యత్తులో కొత్త ల్యాబ్‌లు, లైబ్రరీ కట్టాలంటే మళ్ళీ స్థలం ఎక్కడ వెతకాలి?యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ అవసరాలకే వాడాలని, ఎసిపి కార్యాలయం ఏర్పాటుకు బదులు విద్యార్థులకు అందులో హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ ప్రధాన కార్యదర్శి బోస్క నాగరాజ్, కోశాధికారి రేగుల నరేష్, పి. అభిరామ్ రమేష్, విద్యార్థి సంఘ నాయకులు రమేష్, రాజశేఖర్ ఎస్.అనిల్, ఎం.సాయి, లు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**పేద కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి**



వెంకటపూర్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): వెంకటాపూర్ మండలం ఇంచెన్ చెరువు పల్లిలోని ఆర్మావత్. లక్ష్మ కుమారుడు ఆర్మావత్ యాకూబ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించగా, గురువారం బాధిత కుటుంబానికి కోమాడ్ల ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం మరియు 25కేజీ ల బియ్యం అందించడం జరిగింది పేద కుటుంబం అయిన లక్ష్మ కుటుంబాన్ని గ్రామ యువత అలాగే ఇంకా ఎవరైనా దాతలు వారికి అండగా ఉండాలని కోరుకోవడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో చిన్నల రాజు, సపవత్ బుగ్గ, ఇమ్మడి వెంకన్న, కోమడ్ల రాజు, చెవుల తిరుమల్, కోమడ్ల. జై రెడ్డి,మధుసూదనరెడ్డి, దూగిని సమ్మయ్య, నక్క మహేందర్, లావుడ్య పవన్, తడక రాజశేఖర్, గ్రామ యువత పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**ఆర్టిఓ సంధాని**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా గురువారం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రతా నియమాలు, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ వినియోగం అవసరం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. రహదారి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని రవాణా అధికారి మహమ్మద్ సంధాని విద్యార్థులకు తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రత అంశంపై విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలు విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడ్డాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఏఎంవిఐ సుందర్ లాల్, పరిపాలన అధికారి రత్న సాయి చంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు బాధ్యతాయుతంగా పాటించాలి

**జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్ అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల వాహనలు, ఆటో డ్రైవర్స్,కు వైద్య పరీక్షలు నిర్వహించి రోడ్డు, ఫైర్ భద్రతలపై అవగాహన సమీక్ష సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక వాహన డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా పాటించాలని, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాటిస్తూ, వాహనాల ఓవర్టేక్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక డ్రైవర్ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలని, డ్రైవింగ్ చేసే క్రమంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, టు వీలర్ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇతర హెవీ వెహికల్స్ నడిపే డ్రైవర్స్ సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. పాఠశాలల వాహనాలను క్రమం తప్పకుండా ఫిట్నెస్ ఉండే విధంగా నిత్యం తనిఖీలు చేసుకోవాలన్నారు. వాహనాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎప్పటికీ సిద్ధంగా ఉంచుకోవాలని అనుకోని పరిస్థితులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి అగ్ని ప్రమాదాలను నివారించాలని అన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఎట్టి పరిస్థితులలో ఇవ్వరాదని, లైసెన్సు లేకుండా వాహనం నడపకూడదని సూచించారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్య లు తీసుకుని పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తుందని ఈ మాసంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా డ్రైవర్లకు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో ఈరోజు డ్రైవర్లకి కంటి పరీక్షలు, బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఫైర్ సేఫ్టీ వైద్యం ఆరోగ్యం రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై హాజరైన డ్రైవర్లకు క్లుప్తంగా వివరించారు.

సమావేశం అనంతరం కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లు, వైద్య సిబ్బందికి ప్రజలకు ఫైర్ సేఫ్టీ పై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి టీ .మోహన్ రావు, డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి,సాయి చరణ్, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్, వైద్యాధికారులు, డాక్టర్ మౌనిక, డాక్టర్ నర్మద, డ్రైవర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత నాయకుడుపై చెప్పుతో దాడి

## ఎమ్మెల్యేపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

శాయంపేట, జనవరి 08 (తీన్మార్ న్యూస్): గురువారం శాయంపేట మండల కేంద్రంలో దళిత సంఘం, మరియు తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఓ వార్తాపత్రిక కథనాల్లో వచ్చిన కథనాల ప్రకారం దళిత నాయకుడిపై అగ్రవర్ణ ఎమ్మెల్యే చెప్పుతో దాడి అనే కథనంపై తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రంలో నిరసన తెలుపుతూ అహంకార ఎమ్మెల్యే రాజీనామా, మరియు క్షమాపణ చెప్పాలని నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా దళిత బహుజన నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయాలలో ఓటమిని జీర్ణించుకోలేక ఆ దళిత నాయకుడి పైనే అభాండం మోపి తోటి నాయకుల సమక్షంలోని చెప్పుతో కొట్టడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుపడం జరిగింది. ఈ సందర్భంలో ఆ అహంకార ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. అదేవిధంగా రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం, ఏది ఏమైనాప్పటికీ కిందిస్థాయి నాయకులు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన పై నాయకులు దళిత నాయకుల పైన ఇలా దాడి చేయడం చాలా సిగ్గుచేటు అని అన్నారు. అదేవిధంగా ఈ రాష్ట్రంలో ఉన్న అధిక జనాభా కలిగిన దళిత జాతిని బహిరంగంగా దాడి చేయడం మనువాదాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. కాబట్టి ఈ వార్త కథనాల్లో వచ్చిన కథనాలపై సమగ్ర విచారణ జరిపించి ఆ అగ్రవర్ణ అహంకార ఎమ్మెల్యే పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి యావత్ దళిత జాతికి మొత్తం క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దళిత ఉద్యమం అంటే ఏంటో చూపిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. రానున్న రోజుల్లో దళిత ఓట్ల బలమేందో ఆహంకార ఎమ్మెల్యేకి చూపిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మారపల్లి క్రాంతికుమార్ బహుజన సంక్షమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, వంగరి సాంబయ్య కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు, అంకేశ్వరపూ ఐలయ్య దళిత నాయకులు, తుడుం వెంకటేష్ ఎమ్మార్పీఎస్ నాయకులు, మారపెల్లి విజయ్ బి ఎస్ ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, మారపల్లి సుధాకర్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





# మేడారం జాతరను విజయవంతం చేయాలి

**జాతర విధి నిర్వహణపై జోనల్, సెక్టార్స్ అధికారులకు శిక్షణ**

**అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్**




ములుగు జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను జోనల్, సెక్టార్స్ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరను పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలో భాగంగా మేడారం జాతరలో విధులు నిర్వహించనున్న జోనల్, సెక్టార్స్ అధికారులకు గురువారం మేడారం హరిత హోటల్ లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలసి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతర ప్రాంతాన్ని సమగ్రంగా 12 జోన్లుగా విభజించి, వాటికి సంబంధించిన 62 మంది జోనల్ అధికారులకు, అలాగే 51 సెక్టార్లకు చెందిన 179 మంది సెక్టార్ అధికారులకు నియమించడం జరిగినదని తెలిపారు. జాతర సమయంలో చేపట్టాల్సిన బాధ్యతలు, నిర్వహణ విధానం, ప్రజల భద్రత, రవాణా నియంత్రణ, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి అధికారికి స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన షోప్ మాన్యువల్‌ను అందజేశామని అదనపు కలెక్టర్ తెలిపారు.

జాతర సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పక్క ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. జాతర నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు. డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా జనసందోహాన్ని పర్యవేక్షించడంతో పాటు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులకు మాస్టర్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని అన్నారు. దీంతో సమస్యలు తలెత్తిన వెంటనే గుర్తించి, తక్షణమే పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జంపన్న వాగు ప్రాంతంలో జన సందోహం ఎక్కువగా ఉంటుందని, అధికారులు అప్రమంతగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా 3 షిఫ్టుల్లో గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని, ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా లూయిస్ బ్రెయిలీ 207వ జయంతి వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పట్టణంలోని హెచ్ఎంఆర్డిఎస్ కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ 207వ జయంతి వేడుకలు జిల్లా సంక్షమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడాయి. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మ మాట్లాడుతూ, లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని అన్నారు. బ్రెయిలి లిపి ని కనుగొని మొదటగా ఉన్న 12 చుక్కల బ్రెయిల్ లిపిని ఆరు చుక్కలుగా సరళీకృతం చేసి ప్రపంచవ్యాప్తంగా అంధులకు చదువు, జ్ఞానం అందించిన మహోన్నత వ్యక్తిగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని తెలిపారు. ఆయన అంధులకే కాకుండా సమాజమంతటికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. జిల్లా సంక్షమ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ, లూయిస్ బ్రెయిలీ ఆవిష్కరణ అంధుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఆర్డిఎస్ కేంద్ర నిర్వాహకులు రజిత,రాజయ్య పాల్గొని అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక సేవలందించిన ఉపాధ్యాయురాలు మౌనిక మరియు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షమ శాఖ సిబ్బంది అర్జున్,క్రిష్ణ, సురేష్ హెచ్ఎంఆర్డిఎస్ సిబ్బంది,పిల్లలు పాల్గొన్నారు.

# శీతాకాలంలో మీ ఊపిరితిత్తులను ఇలా కాపాడుకోండి..!



శీతాకాలం వచ్చిందంటే జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎక్కువవుతాయి. ఈ కాలంలో ఊపిరితిత్తులు బలహీనపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే చలికాలంలో ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ముందే జాగ్రత్త పడండి

సాధారణంగా 20 ఏళ్ల వయస్సు వచ్చే సరికి ఊపిరితిత్తుల సామర్థ్య గరిష్ఠ స్థాయికి చేరుతుంది. తర్వాత మన జీవనశైలి ఆధారంగా అది తగ్గవచ్చు. పెద్ద నగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ఆస్తమా, జ్వూణ వంటి సమస్యలు పెరుగుతున్నాయి.

### రోజూ వ్యాయామం తప్పనిసరి

ఊపిరితిత్తులను బలంగా ఉంచుకోవాలంటే రోజూ వ్యాయామం చేయాలి. రోజుకు కనీసం 30 నిమిషాలపాటు వాకింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటివి చేయడం మంచిది. ఇలా చేస్తే ఊపిరితిత్తులు ఎక్కువ ఆక్సిజన్ తీసుకోవడం అలవాటు చేసుకుంటాయి. దీని వల్ల శ్వాసకోశ సామర్థ్య పెరుగుతుంది. నెమ్మదిగా మొదలుపెట్టినా సరే, క్రమం తప్పకుండా చేయాలి. నవ్వడం వల్ల ఊపిరితిత్తుల్లోని పాత గాలి బయటకు వెళ్లి, తాజా గాలి లోపలికి చేరుతుంది. ఇది శ్వాస వ్యవస్థను చురుకుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది, మనసును ప్రశాంతంగా ఉంచుతుంది.

### నీరు తాగండి

చలికాలంలో దాహం తక్కువగా అనిపిస్తుంది కాబట్టి చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. కానీ, నీరు తక్కువగా తాగితే కఫం మందంగా మారి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వస్తుంది. ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోయి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. కాబట్టి చలికాలమైనా సరే రోజుకు సరిపడా నీరు తాగాలి. ఊపిరితిత్తులు బలంగా ఉన్నంత కాలం మీ జీవితం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శ్వాస నాణ్యతే జీవన నాణ్యత. కాబట్టి చలికాలంలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సరైన ఆహారం, వ్యాయామంతో వాటిని కాపాడుకోండి.

# శీతాకాలంలో డయాబెటిస్ కంట్రోల్‌లో ఉండాలంటే..ఇలా చేయండి..!




శీతాకాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోతాయి. వేడి వేడి వంటకాలు, స్వీట్లు తినాలనే కోరిక ఎక్కువవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికీ తీపి పదార్థాలు తినాలనిపిస్తుంది. కానీ, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. అందుకే ఈ కాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. శీతాకాలంలో శరీరానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. దీంతో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారం, తీపి పదార్థాలపై కోరిక పెరుగుతుంది. కానీ డయాబెటిస్ ఉన్నవారు తీపి తింటే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉంది. ఇది గుండె, కిడ్నీ సమస్యలకు కూడా దారి తీస్తుంది.

### ఏం చేయాలి..

డాక్టర్ సూచన మేరకు తీపి తినాలనిపిస్తే బెల్లం చాలా కొద్దిగా మాత్రమే తీసుకోండి. ఆపిల్, బేరి, జామ వంటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లు తినండి. రోజుకు ఒక ఖర్జూరం తీసుకోవచ్చు. భోజనంలో ప్రొటీన్ ఉండేలా చూసుకోండి. పప్పులు, శెనగలు, మొలకెత్తిన ధాన్యాలు, సలాడ్లు తీసుకోవడం మంచిది. ఎక్కువసేపు ఆకలితో ఉండకండి. ఒకేసారి ఎక్కువగా తినకుండా, పరిమితంగా తినడం అలవాటు చేసుకోండి. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగండి. నీరు తాగడం వల్ల కూడా తీపి కోరిక కొంత తగ్గుతుంది. శీతాకాలంలో డయాబెటిస్‌తో బాధపడేవారు తమ ఆరోగ్యం విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే చక్కెర స్థాయిలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉంది.

### జాగ్రత్తలు..

రెండు రోజులకు ఒకసారి షుగర్ లెవెల్స్ చెక్ చేయండి.

డాక్టర్ ఇచ్చిన మందులు సమయానికి తీసుకోండి.

రోజుకు కనీసం 7 గంటలు నిద్రపోండి.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.

# ఇవి తింటే గుండె సంబంధిత వ్యాధులను దూరం పెట్టొచ్చు



దేశంలో ఇటీవల గుండెపోటు మరణాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మనం తీసుకునే ఆహారం చాలా కీలకపాత్ర పోషిస్తుంది. సరైన పోషకాహారం ద్వారా రక్తపోటు, కొలెస్ట్రాల్, రక్త నాళాల్లో అడ్డంకులను అరికట్టి గుండె జబ్బులను దూరం పెట్టొచ్చు. గుండెకు మేలు చేసే కొన్ని ముఖ్యమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం.

ఆకుకూరలు : మార్కెట్ లో నిత్యం దొరికే పాలకూర, తోటకూర వంటి ఆకుకూరల్లో విటమిన్ ఖ, నైట్రేట్లు అధిక సంఖ్యలో ఉంటాయి. ఇవి రక్త నాళాలను రక్షించి, రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.

నట్స్, విత్తనాలు : వీటిలో ఉండే మెగ్నీషియం, కాపర్, మాంగనీస్ గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. రోజుకు గుప్పెడు (సుమారు 30 గ్రాములు) తీసుకోవడం మంచిది.

ఆల్మండ్స్ (బాదం పప్పు)ాూశ్రీఎశీఅం: ఇందులో విటమిన్ ఇ, ఫైబర్, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, కాల్షియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. బరువు తగ్గించడం, మెదడు పనితీరు మెరుగుపరచడం, చర్మానికి పోషణ, ఎముకల బలానికి ఉపయోగపడతాయి.

తృణధాన్యాలు : బ్రౌన్ రైస్, రాగులు, జొన్నలు, ఓట్స్ వంటి వాటిలో పీచు పదార్థం (ఖీఱవవతీ) ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

వెల్లుల్లి : ఇది ఉల్లిజాతికి చెందిన మొక్క, వంటల్లో రుచిని పెంచడమే కాదు, ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే అల్లిసిన్ అనే సమ్మేళనం రక్తపోటును తగ్గించడానికి, రక్తం గడ్డ కట్టకుండా చూడటానికి సహాయపడుతుంది. ఉదయం పూట ఒక రెబ్బ వెల్లుల్లి తినడం గుండెకు చాలా మంచిది.

పండ్లు : పండ్లలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అరటి, మామిడి, ద్రాక్ష వంటి పండ్లలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అవి శరీరానికి బలాన్ని, శక్తిని అందిస్తాయి. ఇక స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ గుండె కణాలను రక్షిస్తాయి.

అవకాడో: ఇందులో ఉండే మోనో అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్ కొలెస్ట్రాల్ ని తగ్గించడమే కాదు, గుండె పనితీరు మెరుగుపరుస్తుంది.

ఫ్యాటీ ఫిష్ : చేపలు గుండె ఆరోగ్యానికి చక్కటి ఆహారం అని చెప్పొచ్చు. ముఖ్యంగా సాల్మాన్, మాకేరెల్ ఫిష్ లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి,

ఇవి గుండె కొట్టుకునే వేగాన్ని క్రమబద్ధీకరిస్తాయి, వాపులను తగ్గిస్తాయి.

గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే దూరంగా ఉంచాల్సిన ఆహారం ఏంటంటే.. ప్యాకెట్ ఫుడ్స్, చిప్స్, కూల్ డ్రింక్స్ లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్. ఇవి గుండెకు బద్ధ శత్రువులనే చెప్పొచ్చు. ఆహారంతో పాటు ప్రతిరోజూ సాధ్యమైనంత వరకు కనీసం 30 నిమిషాలు నడక, వ్యాయామం చేయడం వల్ల గుండె మరింత దృఢంగా మారుతుంది.

# తిన్న వెంటనే నీళ్లు తాగితే ఏమవుతుంది?



ఆహారం, నీరు రెండూ మన ఆరోగ్యానికి చాలా అవసరం. కానీ, వాటిని సరైన సమయంలో తీసుకోవడం ముఖ్యం. చాలా మందికి భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. అయితే ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఈ అలవాటు జీర్ణక్రియకు మంచిది కాదు. దీని వల్ల కడుపు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మన శరీరం ఆహారాన్ని జీర్ణం చేయడానికి ప్రత్యేక జీర్ణ రసాలను ఉత్పత్తి చేస్తుంది. తిన్న వెంటనే నీరు తాగితే ఈ రసాలు నీరుగా మారి, వాటి పని సరిగ్గా జరగదు. దీని వల్ల అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

### తిన్న తర్వాత ఎంతసేపటికి నీళ్లు తాగాలి?

నిపుణుల ప్రకారం, భోజనం చేసిన 30 నుంచి 45 నిమిషాల తర్వాత నీరు తాగడం మంచిది. భోజనం చేసే ముందు నీరు తాగాలనుకుంటే, అరగంట ముందు తాగాలి. ఇలా చేస్తే ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది, శరీరానికి పోషకాలు బాగా చేరుతాయి.

### తిన్న వెంటనే నీళ్లు తాగితే వచ్చే సమస్యలు

జీర్ణక్రియ బలహీనపడుతుంది: ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం వల్ల అజీర్ణం, గ్యాస్, కడుపు నొప్పి వస్తాయి. ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే విటమిన్లు, ఖనిజాలు శరీరానికి పూర్తిగా అందవు. దీని వల్ల బలహీనత, అలసట రావొచ్చు.

కడుపు బరువుగా అనిపిస్తుంది: నీరు తాగడంతో కడుపు ఉష్ణోగ్రత తగ్గి, ఆహారం ఆలస్యంగా జీర్ణమవుతుంది. దీంతో ఉబ్బరం, అసిడిటీ సమస్యలు పెరుగుతాయి.

బరువు పెరిగే అవకాశం: ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే కొవ్వు పేరుకుపోయి, మెటబాలిజం నెమ్మదిస్తుంది. దీనివల్ల బరువు పెరిగే అవకాశం ఉంది.

భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగే అలవాటు ఉంటే, దాన్ని మెల్లగా మార్చుకోవాలి. 30-45 నిమిషాల గ్యాప్ తర్వాత నీరు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చిన్న మార్పే అయినా.. దీని వల్ల పెద్ద లాభం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.


# జామపండును తొక్కతో తినాలా? లేక తీసేసి తినాలా?

జామపండు చాలా మందికి ఇష్టమైన పండు. పోషకాలతో నిండిన ఈ పండును చాలా మంది 'సూపర్ ఫ్రూట్' అని అంటారు. అయితే జామపండును తొక్కతో తినాలా? లేక తొక్క తీసేసి తినాలా? అని ఎక్కువ మందికి సందేహం ఉంటుంది. ఈ విషయంపై పోషకాహార నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

నిపుణుల ప్రకారం, జామపండును తొక్కతో తింటే పొటాషియం, జింక్, విటమిన్ జ వంటి ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. అయితే డయాబెటిస్ ఉన్నవారు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు జామపండును తొక్క లేకుండా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే తొక్కతో తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

### జామపండు ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

- రోగనిరోధక శక్తి పెరుగుతుంది: జామపండులో విటమిన్ C చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది జలుబు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ ఇస్తుంది. ఒక జామపండు తింటే రోజుకు అవసరమైన విటమిన్ జ కంటే ఎక్కువే లభిస్తుంది.
- జీర్ణక్రియ మెరుగవుతుంది: జామపండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది, మలబద్ధక సమస్యను తగ్గిస్తుంది.
- చర్మానికి మెరుపు ఇస్తుంది: జామలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ A ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, ముడతలు రాకుండా సహాయపడతాయి.
- గుండె ఆరోగ్యానికి మంచిది: పొటాషియం, మెగ్నీషియం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. క్రమం తప్పకుండా జామపండు తినేవారిలో బీపీ, కొలెస్ట్రాల్ తగ్గినట్లు పరిశోధనలు చెబుతున్నాయి.
- మీకు డయాబెటిస్, కొలెస్ట్రాల్ సమస్యలు లేకపోతే జామపండును తొక్కతో తినొచ్చు. అలాంటి సమస్యలు ఉంటే తొక్క తీసేసి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.



# మహిళల ప్రీమియర్ లీగ్ 2026కు రంగం సిద్ధం

## నేటి నుంచే డబ్ల్యూపీఎల్ నాలుగవ సీజన్..



మహిళల క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. గతేడాది ఆసియా కప్ విజయం తర్వాత భారత మహిళల జట్టు మీద అంచనాలు పెరగగా, ఈ లీగ్ ద్వారా మరింత మంది యువ క్రీడాకారిణులు వెలుగులోకి రానున్నారు. జనవరి 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ టోర్నీకి తెరలేవనుంది. వేదికలు: ఈసారి టోర్నీ రెండు ప్రధాన నగరాల్లో జరగనుంది. మొదటి 11 మ్యాచ్‌లు నవీ ముంబైలోని డి.వై.పాటిల్ స్టేడియంలో, మిగిలిన మ్యాచ్‌లు (ఎలిమినేటర్ మరియు ఫైనల్‌తో సహా) వడోదరలోని బి.సి.ఎ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ఒకసారి విజేతగా నిలిచిన ఆర్‌సీబీ.. మరో టైటిల్‌పై కన్నేసింది.అరంగేట్ర సీజన్‌తో పాటు గత సీజన్‌లో ఆర్‌సీబీ పేలవ ప్రదర్శనతో పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ క్రమంలోనే నాలుగో సీజన్‌లో ఎలాగైనా టైటిల్ గెలవాలనే కసితో జట్టును ప్రక్షళన చేసిన ఆర్‌సీబీకి టోర్నీ ఆరంభానికి ముందే బిగ్ షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ గాయంతో ఈ సీజన్‌కు దూరమైంది. ఆమె స్థానాన్ని సాయలీ సత్ఘరే అనే భారత ఆల్‌రౌండర్‌తో ఆర్‌సీబీ భర్తీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-4కు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ హ్యాట్రిక్ టైటిల్‌పై గురిపెట్టగా ఆ జట్టుకు ఈసారి బెంగళూరు, గుజరాత్‌లనుంచి గట్టి పోటీ ఎదురు కానుంది. ఆడిన మూడు సీజన్‌లలో రెండుసార్లు సునాయాసంగా టైటిల్ చేజిక్కించుకున్న ముంబ యికి 2024లో తొలిసారి స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చెక్ పెట్టింది. దీంతో ఆ జట్టు తొలిసారి టైటిల్‌ను సాధించింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 5జట్ల మధ్య డబ్ల్యుపిఎల్ సంగ్రామం జరగనుండగా..

టోర్నీలో మొత్తం 22మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈసారి నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియం, వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడి యంలో మాత్రమే డబ్ల్యుపిఎల్ లీగ్ జరుగుతుంది. మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరగాలన్న ఉద్దేశ్యంతో బిసిసిఐ టికెట్‌ను కేవలం 100 రూపాయల ప్రారంభ ధరగా నిర్ణయించింది. 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య డివై పాటిల్ స్టేడియం, నవీ ముంబయిలో జరుగుతుంది. ఆ తర్వాత జనవరి 10న డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ రోజు తొలి మ్యాచ్‌లో యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య, రెండో మ్యాచ్ ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనున్నాయి. ఫిబ్రవరి 1తవరకు డబుల్ రౌండ్ రాబిన్ మ్యాచ్‌లు జరుగుతాయి. గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించింది. అంతర్జాతీయ క్రిట్‌లో సుదీర్ఘ అనుభవమున్న ఇంగ్లండ్ వెటరన్ సారా టేలర్‌కు ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. 13ఏళ్ల కెరీర్‌కు 2019లో వీడ్కోలు పలికింది. మూడు ఫార్మట్లలో 226 మ్యాచులు ఆడిన సారా 6,500 పరుగులు సాధించింది. మహిళా క్రిట్‌కు విశేష సేవలందించిన ఆమెకు 2025లో ఐసిసి హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. అనంతరం కోచ్‌గా కౌంటీల్లో ఇంగ్లండ్ సీనియర్ జట్టుకు సేవలందించింది. జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇచ్చిన సారా ఫీల్డింగ్ ప్రమాణాలు నెలకొల్పింది. దాంతో.. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం ఆమెను గుజరాత్ జెయింట్స్ యాజమాన్యం సంప్రదించింది. జనవరి 10న యూపీ వారియ-ర్స్‌తో గుజరాత్ తలపడనుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో మ్యాచ్ జరుగనుంది.

# భారత్‌కు భారీ ఎదురుదెబ్బ

**తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయం**

**నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం**



టీ20 వరల్డ్‌కప్ ముంగిట భారత్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. యంగ్ బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న తిలక్?కు ఇటీవల పొట్ట కింది భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. డాక్టర్ల సూచన మేరకు అతడికి సర్జరీ చేయించారు. ప్రస్తుతానికి అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది.ఈ సర్జరీ కారణంగా తిలక్ వర్మ నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. దీంతో ఇదే నెలలో న్యూజిలాండ్‌తో జరగాల్సిన టీ20 సిరీస్?కు అతడు దూరం కానున్నాడు. జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగాల్సిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు తిలక్? ఎంపికైయ్యాడు. కానీ సర్జరీ కావడంతో ఈ సిరీస్?కు తిలక్ అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇంకో ప్లేయర్?ను ప్రకటించాల్సి ఉంది.అయితే తిలక్ లాంటి హిట్టింగ్ బ్యాటర్ వరల్డ్‌కప్‌కు ముందు గాయపడడం భారత్‌కు పెద్ద దెబ్బ! వచ్చే నెల 07న టోర్నమెంట్ ప్రారంభం కానుంది. అప్పటిలోగా అతడు పూర్తిగా కోలుకొని ఫిట్‌గా అవ్వాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అయితే తిలక్ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే వరల్డ్‌కప్‌లో అతడు ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడాన్ని కచ్చితంగా చెప్పలేం!విజయ్ హాజారేలో హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ టోర్నీలో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ఓడడంతో క్వాలిఫైయర్స్‌కు అర్హత సాధించలేదు. రీసెంట్‌గా చండీగఢ్, బంగాల్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో హైదరాబాద్ విజయం సాధించింది. దీంతో ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడి, రెండింట నెగ్గింది.గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ అద్భుతంగా పోరాడాడు. 150 పరుగుల ఛేదనలో 53 బంతుల్లో 69 పరుగులతో రాణించి టీమ్ఇండియాను గెలిపించాడు. పాకిస్థాన్‌పై ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో తిలక్ పోరాటం అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పటిదాకా అతడి కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ఇన్నింగ్స్ అనడంలో ఎలాంటి డౌట్ లేదు. కాగా, 2023లో తిలక్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఇప్పటిదాకా 40 మ్యాచ్‌ల్లో 49 యావరేజ్‌తో 1182 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 143.98గా ఉంది.

టీమ్ఇండియా వరల్డ్‌కప్ జట్టు : అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ ( వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి

# నిబంధనలను ఉల్లంఘించిన పాండ్యా

భారత స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్ళీ వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి తన ఆటతోనే కాకుండా, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో చర్చనీయాంశమయ్యారు. విజయ్ హజారే ట్రోఫీలో బరోడా తరపున ఆడుతున్న పాండ్యా, చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టినప్పటికీ, బోర్డు పెట్టిన ఒక ముఖ్యమైన నిబంధనను పక్కన పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. నిజానికి న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం టీమిండియాను సెలక్ట్ చేసినప్పుడు హార్దిక్ పాండ్యా 10 ఓవర్ల బౌలింగ్ చేయడానికి ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్ కాలేదని బీసీసీఐ స్పష్టం చేసింది. రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని పాండ్యాను జాగ్రత్తగా కాపాడుకోవాలని నేషనల్ క్రికెట్ అకాడమీ, సెలక్టర్లు భావించారు. కానీ విజయ్ హజారే ట్రోఫీలో చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఏకంగా 10 ఓవర్ల కోటాను పూర్తి చేశారు. ఈ 10 ఓవర్లలో 66 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టారు. బోర్డు వారించినా కూడా పాండ్యా ఇంత రిస్క్ తీసుకోవడం ఇప్పుడు చర్చకు దారితీసింది. బౌలింగ్‌లో నిబంధనలు పక్కన పెట్టిన పాండ్యా, బ్యాటింగ్‌లో మాత్రం తన విశ్వరూపం చూపించారు. కేవలం 31 బంతుల్లోనే 75 పరుగులు చేసి మైదానంలో పరుగుల వరద పారించారు. ఇతని ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 2 ఫోర్లు ఉన్నాయి. 240కి పైగా స్ట్రైక్ రేట్‌తో ఆడిన పాండ్యా ప్రతాపానికి బరోడా జట్టు 391 పరుగుల భారీ స్కోరు సాధించింది. సమాధానంగా చండీగఢ్ 242 పరుగులకే కుప్పకూలడంతో బరోడా ఘనవిజయం సాధించింది. గత రెండు మ్యాచ్‌ల్లో పాండ్యా ఏకంగా 20 సిక్సర్లు బాదడం గమనార్హం. ఫిట్‌నెస్ విషయంలో బోర్డు ఆదేశాలను ధిక్కరించినందుకు పాండ్యాకు బీసీసీఐ నుంచి మొట్టికాయలు పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ లేదా ఎన్‌సీఏ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే ఆయన బౌలింగ్ చేశారా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ అనుమతి లేకుండానే బౌలింగ్ చేసి ఉంటే, భవిష్యత్తులో గాయాల బారిన పడితే అది జట్టుకు పెద్ద లోటు అవుతుంది. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు సిద్ధమవుతున్నారు.

# 4- 1తేడాతో యాషెస్ ఆసీస్ కైవసం

**చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం**

**5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ పై విక్టరీ**



యాషెస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం సాధించింది. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో మ్యాచ్?లో ఇంగ్లాండ్?పై ఆసీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 160 పరుగుల స్వల్ప ఛేదనలో ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మార్నస్ లబుషేన్ (37), జేక్ వెదరాల్డ్ (34) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 3, విల్ జాక్స్ 1 వికెట్ దక్కించుకున్నారు. దీంతో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్?ను ఆస్ట్రేలియా 4-1 తేడాతో దక్కించుకుంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరుతో ఐదో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జాకబ్ బెతెల్ (154 పరుగులు) భారీ సెంచరీతో ఆకట్టుకున్నాడు. హ్యారీ బ్రూక్ (42), బెన్ డకెట్ (42) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, వెబ్?స్టర్ చెరో 3, బొలాండ్ 2, నెసర్ 1 వికెట్ తీశాడు. దీంతో ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యాన్ని ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి 31.2 ఓవర్లలో ఛేదించింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (16) విన్నింగ్ షాట్ బాదాడు. కామెరూన్ గ్రీన్ 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. "మా జట్టు ప్రదర్శన అద్భుతం. అందరూ సమష్టిగా రాణించారు. ముఖ్యంగా స్టార్క్, హెడ్, క్యారీలు ఈ సిరీస్‌లో నిలిచిపోయే ప్రదర్శన చేశారు" అని ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. ఇక "మేము ఇంతకంటే బాగా ఆడాల్సింది. కానీ ఆస్ట్రేలియా ఐదు టెస్టుల్లోనూ అద్భుతంగా ఆడింది" అని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రత్యర్థిని కొనియాడాడు. కాగా, ఈ సిరీస్?లో పాట్ కమిన్స్ గైర్హాజరీలో స్మిత్ 4 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.ఈ సిరీస్?లో ఆసీస్ ప్లేయర్లు రికార్డులు సృష్టించారు. పేసర్ మిచెల్ స్టార్క్ ఈ సిరీస్‌లో 19.9 సగటుతో ఏకంగా 31 వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ణ గా ఎంపికైయ్యాడు. అటు బ్యాటింగ్?లో ట్రావిస్ హెడ్ మూడు భారీ సెంచరీలతో రెచ్చిపోయాడు. సిరీస్?లో ఏకంగా 629 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ కూడా 28 డిస్మిసల్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరి రోజు ఆటలో థర్డ్ అంపైర్ నిర్ణయం కాంట్రవర్సీ అయ్యింది. ఆసీస్ బ్యాటర్ జేక్ వెదరాల్డ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బంతి బ్యాట్‌కు తాకినట్లు అనిపించింది. ఇంగ్లాండ్ అప్పీల్ చేయగా అంపైర్ నాటౌట్ ఇచ్చారు. డీఆర్ఎస్?లో స్నికో మీటర్‌లో చిన్న కదలిక కనిపించింది. అయినా థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు షాక్ అయ్యారు. కెప్టెన్ స్టోక్స్ అంపైర్లతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్?తో ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా కెరీర్? ముగిసింది. అతడికి ఇదే చివరి టెస్టు కావడంతో మైదానంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన ఖవాజాకు ఇంగ్లాండ్ ఆటగాళ్లు 'గార్డ్ ఆఫ్ హానర్ణ ఇచ్చి గౌరవించారు. అభిమానులు చప్పట్లతో స్టేడియాన్ని హోరెత్తించారు. ఖవాజా తన చివరి ఇన్నింగ్స్‌లో 4 పరుగులు చేసి ఔటయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ మైదానంలో రాసిన "థంక్యూ ఉజీ" సందేశం వద్ద మోకాళ్లపై కూర్చుని పిచ్‌ను ముద్దాడాడు. ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్?కు క్రికెట్ అభిమానులు పోటెత్తారు. ఐదు రోజుల్లో కలిపి మొత్తం 2,11,032 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. సిడ్నీ మైదానంలో అత్యధిక మంది హాజరైన టెస్టుగా ఈ మ్యాచ్ రికార్డు సృష్టించింది.

# 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లు

**వైభవ్ సూర్యవంశీ ఊచకోత**



గతేడాది ఐపీఎల్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు 2026 ప్రారంభంలోనే సౌతాఫ్రికా పర్యటనలో తన విశ్వరూపాన్ని చూపించాడు. అక్కడ జరుగుతున్న అండర్-19 వన్డే సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లతో 68 పరుగులు చేసి ఊచకోత కోశాడు. విదేశీ గడ్డపై, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించే సౌతాఫ్రికా పిచ్‌లపై ఈ రేంజ్ హిట్టింగ్ చూసి క్రికెట్ పండితులు నోరెళ్లబెడుతున్నారు. ఇది సౌతాఫ్రికాలో వైభవ్‌కు నమోదైన తొలి 50 స్కోరు కావడం విశేషం. వైభవ్ సూర్యవంశీ కేవలం పరుగులు సాధించడమే కాకుండా, తన దేశం కోసం ఒక భారీ కానుకను సిద్ధం చేస్తున్నాడు. మార్చి 27న వైభవ్ తన 15వ పుట్టినరోజు జరుపుకోనున్నాడు. అయితే ఆ పర్వదినం కంటే ముందే భారత్‌కు అండర్-19 వరల్డ్ కప్ ట్రోఫీని గిఫ్ట్‌గా ఇవ్వాలని కంకణం కట్టుకున్నాడు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వే, నమీబియా వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. ఈ టోర్నీలో వైభవ్ తన బ్యాట్‌తో గనుక భారత్‌ను విజేతగా నిలబెడితే, అతి చిన్న వయసులో అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. వైభవ్ ఆడుతున్న విధానం చూస్తుంటే టీమిండియాకు మరో విధ్వంసకర ఓపెనర్ దొరికాడనే భావన కలుగుతోంది. గతేడాది మొత్తం రికార్డుల మీద రికార్డులు కొల్లగొట్టిన వైభవ్, ఇప్పుడు అదే ఫామ్‌ను 2026కి కూడా మోసుకొచ్చాడు. అండర్-19 వరల్డ్ కప్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న తరుణంలో, వైభవ్ సూర్యవంశీ కీలక పాత్ర పోషించనున్నాడు. తన 15వ ఏట అడుగుపెట్టకముందే ప్రపంచ క్రికెట్‌లో ఒక కొత్త శకాన్ని లిఖించడానికి ఈ బీహార్ కుర్రాడు సిద్ధమయ్యాడు.

# నేడు థియేటర్లలోకి ది రాజాసాబ్ మూవీ

## ప్రభాస్ అభిమానులకు సంక్రాంతి పండగ

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ-మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిందని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

# ఏపిలో పెరిగిన టిక్కెట్ ధరలు

## తెలంగాణలో తొలగని ఉత్కంఠ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బ్జడెట్ మూవీ 'ది రాజా సాబ్' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది, మారుతి దర్శకత్వంలో హారర్-కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపు మరియు బెనిఫిట్ షోలకు సంబంధించి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా బెనిఫిట్ షోలకు, తర్వాత పది రోజుల పాటు టికెట్ రేట్లను పెంచుతూ ఒక జీవో జారీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ జీవో ఇంకా రాలేదు. రాత్రికే బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ వేయాల్సి ఉండగా ఆ జీవో ఇంకా రాలేదు. అయితే కోర్టు సమయం ముగిశాక ఆ జీవో జారీ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా ఏదైనా పెద్ద సినిమాకు ప్రభుత్వం రేట్లు పెంచుతూ జీవో ఇచ్చిన వెంటనే, కొందరు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల బుకింగ్స్ ఆగిపోవడం లేదా చివరి నిమిషంలో చిక్కులు ఎదురవడం వంటివి జరుగుతుంటాయి.ప్రభుత్వ జీవో వెలువడిన వెంటనే థియేటర్ యాజమాన్యాలు బుక్‌మైషో సహా ఇతర పోర్టల్స్‌లో బుకింగ్స్ జరిగేలా డేటాను అప్‌డేట్ చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం, నేడు సాయంత్రం 5:30 నుండి 6:00 గంటల మధ్య 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తిస్థాయిలో ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బెనిఫిట్ షోలకు (అర్ధరాత్రి లేదా తెల్లవారుజాము షోలు) కూడా లైన్ క్లియర్ అయింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన కేంద్రాలలో ఈ షోల కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం అనుమతి కూడా దాదాపు ఖాయం కావడంతో ఇప్పుడు రికార్డు స్థాయి వసూళ్లపై చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.




# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

# 4.69 కోట్లతో రష్మిక నెం.1



హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ దక్కించుకుని, ఇంకా పలు తెలుగు సినిమాలు చేస్తోంది. మరో వైపు తమిళ సినిమాలు వరుసగా చేస్తూనే ఉంది. ఇక సొంత భాష అయిన కన్నడంలోనూ ఈమె సినిమాలు చేస్తూనే ఉంది. మరో వైపు బాలీవుడ్‌లో ఆగకుండా సినిమాలు చేస్తూనే ఉంది. అందుకే పాన్ ఇండియా రేంజ్‌లో ఈమెను స్టార్ హీరోయిన్ అంటూ అభిమానులు పిలుచుకుంటున్నారు. నేషనల్ క్రష్ అంటూ అభిమానులు పిలుచుకునే ఈ అమ్మడు తాజాగా నెం.1 స్థానంలో నిలిచింది. హీరోయిన్‌గా కాకుండా పన్ను చెల్లించే విషయంలో ఈమె నెం.1 గా నిలిచి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. కేవలం హీరోయిన్‌గానే కాకుండా కుటుంబంకు చెందిన వ్యాపారాల్లోనూ భాగస్వామ్యం ఉన్న కారణంగా రష్మిక అత్యధిక పన్ను చెల్లించినట్లు తెలుస్తోంది. ఒక జాతీయ మీడియా సంస్థ కథనం అనుసారంగా రష్మిక మందన్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలకు కలిపి ఏకంగా □4.69 కోట్ల పన్ను చెల్లించింది. కన్నడకు చెందిన హీరోయిన్స్ ఈ స్థాయిలో పన్ను చెల్లించడం చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. పైగా రష్మిక సొంత జిల్లా అయిన కొడగు లో పన్ను చెల్లించిన వారు అందరితో పోల్చితే అత్యధిక పన్ను చెల్లింపు దారుగా రష్మిక నిలిచి నెం.1 స్థానంను దక్కించుకుంది. హీరోయిన్‌గా ఆమె చేస్తున్న వరుస సినిమాలకు కోటాను కోట్ల పారితోషికం అందుకుంటూ ఉంది. పైగా ఈమె ఇటీవల లేడీ ఓరియంటెడ్ సినిమాను చేయడం వల్ల, లాభాల్లో వాటాను సైతం తీసుకుందనే వార్తలు వచ్చాయి. దాంతో ఆమె పారితోషికం అత్యధికంగా అంది ఉంటుంది అనేది చాలా మంది మాట. అందుకే ఈమె తన ఆదాయంకు తగ్గట్లుగానే భారీ మొత్తంలో పన్నును చెల్లించింది అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రష్మిక మందన్న సినిమాల విషయానికి వస్తే ఇటీవలే ది గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కమర్షియల్ ఫలితాన్ని పక్కన పెడితే ఒక మంచి డీసెంట్ ఫిల్మ్‌గా, ఆలోచింపజేసే విధంగా ఉంది అంటూ రివ్యూలు దక్కించుకుంది. మంచి సినిమాలో నటించావు అంటూ చాలా మంది రష్మిక మందన్న ను అభినందించారని తెలుస్తోంది. రష్మిక గత ఏడాదిలో ఏకంగా ఛావా, సికిందర్, కుబేరా, థామా, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సికిందర్ మినహా మిగిలిన అన్ని సినిమాలు ఈమెకు మంచి పేరును తెచ్చి పెట్టాయి. అందుకే గత ఏడాది ఆమెకు చాలా కలిసి వచ్చిందని అంటారు. ఇక ఈ ఏడాదిలో ఈమె రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. తెలుగులో మైసా అనే సినిమాతో ఈమె పవర్ ఫుల్ పాత్ర తో కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అతి త్వరలోనే మరిన్ని వివరాలు రావాల్సి ఉన్నాయి.

# భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో వస్తోన్న రవితేజ

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు. ఇటీవల వరుస పరాజయాలతో ఉన్న రవితేజ ఇప్పుడు ఈసినామపై ఆశలు పెట్టుకున్నారు. ఇది విజయవంతం కావాలని కోరుకుంటున్నాడు.





# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు

రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తిండిపోతుందంటూ నవ్వులు పూయిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463